# ఎక్కవలసిన రైలు

## – సత్యం మందపాటి



"సాహితీ సిరికోన" వారి ఆధ్వర్యంలో నిర్వహించిన "శ్రీ జొన్నలగడ్డ రాంభొట్లు- సరోజమ్మ స్మారక పురస్కారం" బహుమతి అందుకున్న నవల.

*(గత సంచిక తరువాయి)*

**"అది చాల పెద్ద కథ**. మనం మీ సామాను ఎపార్ట్మెంటులో పడేసి బయట డిన్నరుకి వెడదాం. అక్కడ తీరిగ్గా చెబుతాను. అప్పటిలోగా మీ గురించి చెప్పండి" అన్నాడు.

సమీర నవ్వి, "నాది కూడా పెద్ద కథే. కానీ అంతా ఇప్పుడు చెప్పను. చికాగోలో మైక్రో బయాలజిస్టుగా పనిచేస్తున్నాను. ఈమధ్య నా బిజీ పనులనించీ కొంచెం మార్పు కోసం ఎదురుచూస్తుంటే, ఇక్కడ యూనివర్సిటీ వాళ్ళు నేను ప్రచురించిన పేపర్లు చూసి, పన్నెండు నెలల ప్రాజెక్టు మీద పని చేస్తావా అన్నారు. మంచి సమయానికే నాకు ఈ అవకాశం వచ్చింది కనుక సరేనన్నాను. అంతేకాక నేను, జెస్సికా ఎలిమెంటరీ స్కూలు రోజులనించీ స్నేహితులం. జెస్సీ లండన్ వచ్చాక మేము మళ్ళీ కలవలేదు. నాలుగైదేళ్ళు అయిందేమో. అది కూడా ఇంకో మంచి అవకాశం కదా అని వెంటనే వచ్చేశాను"

"షార్ట్ అండ్ స్వీట్ స్టోరీ. నేనూ బాబ్ కజిన్స్. మా అమ్మా, అతని అమ్మా అక్కచెల్లెళ్ళు. వాళ్ళు వుండేది చికాగోలో, మేము కాలిఫోర్నియాలో. వాడిని నేను కూడా చాలా రోజుల తర్వాత ఈ ట్రిప్పులోనే చూడటం" అన్నాడు నిక్.

"బాగుంది. ఇట్స్ ఎ స్మాల్ వరల్డ్" అంది సమీర.

"అవును" అని టాక్సీ అతనేదో అడుగుతుంటే జవాబు చెబుతున్నాడు నిక్.

సమీర కిటికీలోనించీ బర్మింగ్హాం సిటీ ఎలా వుందో చూస్తున్నది.

అప్పుడే సూర్యాస్తమయం అయినట్టుంది. చిరుచీకటిగా వుంది. సన్నటి రోడ్లు. ఇళ్ళు కూడా ఒకదానికి ఒకటి ఆనుకుని ఎంతో దగ్గరగా వున్నాయి. అమెరికాలోలా ఇంటి ముందు పెద్ద పెద్ద యార్డులు కూడా లేవు.

సమీర జెస్సికాకి ఫోన్ చేసి తను బాగానే చేరాననీ, నిక్ వచ్చి ఎపార్టుమెంటుకి తీసుకు వెదుతున్నాడనీ, మళ్ళీ పిలిచి మాట్లాడతాననీ చెప్పింది.

అంతలోనే ఒక మూడంతస్తుల ఇంటి ముందు ఆగింది టాక్సీ.

“వచ్చేశాం. ఇదే యూనివర్సిటీ వాళ్ళు టెంపరరీ రీసెర్చి స్కాలర్లకు ఇస్తున్న ఎపార్టుమెంట్లు. ఇక్కడి నించీ యూనివర్సిటీకి ఐదు నిమిషాల నడక” అన్నాడు టాక్సీ అతను.

అక్కడ కూడా కొంచెం చీకటిగానే వుంది.

ఎదురుగా వున్న బుక్ షాపులోని లైట్లు కొంచెం వెలుతురునిస్తున్నాయి.

“నాకు ఇచ్చిన రూమ్ ఒకటో ఫ్లోర్లోనే వుంది. మెట్లు ఎక్కనఖ్కరలేదు” అన్నది సమీర.

నవ్వాడు నిక్. “ఇక్కడ మన అమెరికాలోలా కాదు. ఇక్కడి మొదటి ఫ్లోర్ మనకి రెండో ఫ్లోర్. మన మొదటి ఫ్లోర్ ఇక్కడ గ్రౌండ్ ఫ్లోర్. మీరు ఒక అంతస్తు మెట్లు ఎక్కాల్సిందే" అన్నాడు.

“అవును మరచిపోయాను. ఇండియాలో కూడా అలాగే. లండన్లో జెస్సీ ఎపార్ట్మెంటులో చూశాను కదా” అంది.

“మీరు ఈ చిన్న బాగ్ తీసుకురండి, నేను ఈ రెండు పెద్ద సూట్కేసులూ తీసుకుని మీవెంటే వస్తాను” అన్నాడు నిక్.

పైకి వచ్చాక “ఇదే నాకు ఇచ్చిన ఎపార్టుమెంట్” అన్నది సమీర.

సమీర గది తాళం తీస్తుండగా, “మనిద్దరికీ ఒకే చోట ఇచ్చారే” అంటూ వచ్చాడు అశోక్. అతని పక్కనే అతని మిత్రుడు వినీల్.

సమీర నవ్వి, “మీ ఎపార్టుమెంటు ఎక్కడ?” అడిగింది.

“మీరు మధ్యలో వున్నారు. నేను ఆ చివర” అంటూ అటు చూపించాడు అశోక్.

“బాగుంది. నాకు మంచి కంపెనీ” అంది సమీర.

అశోక్ చిన్నగా తలవూపి “మేము డిన్నరుకి వెదుతున్నాం. మళ్ళీ కలుద్దాం” అని వెళ్ళిపోయాడు.

అది ఒక పెద్ద గది, దానికి ఆనుకుని ఒక పక్క కిచెన్, ఇంకొక పక్క బాత్రూము. ఆ పెద్ద గదిలోనే ఒక పక్క బెడ్, దాని పక్కనే ఒక టేబుల్, కుర్చీ చదువుకోవటానికి. కిచన్ కౌంటరునే డైనింగ్ టేబులుగా వాడుకోమని కాబోలు, కౌంటర్ దగ్గర రెండు ఎత్తు కుర్చీలు వున్నాయి.

“బాగుంది. ఒక మనిషికి ఇంతకన్నా ఎక్కువ అనవసరం” అంది సమీర.

సూట్కేసులు లోపల పెడుతూ అన్నాడు నిక్. “అవును. బాగుంది. మనవేపు ఎఫిషెన్సీ ఎపార్ట్మెంటు లాగా. ఒక పని చేద్దాం. మీరు ఫ్రెషప్ అయి, ఇక్కడికి ఎదురుగానే వున్న పుస్తకాల షాపుకి రండి. నేను అక్కడ వుంటాను. అట్నించి భోజనానికి వెడదాం. అవగానే మిమ్మల్ని ఇక్కడ దించి నేను వెడతాను” అన్నాడు నిక్.

"సరే! పది నిమిషాల్లో అక్కడ వుంటాను" అన్నది సమీర.

చెప్పినట్టుగానే పదినిమిషాల్లో అక్కడి పుస్తకాల షాపుకి వచ్చింది.

ఏవో సైకాలజీ పుస్తకాలు తిరగేస్తున్నాడు నిక్.

"ఏమిటి? సైకాలజీలోకి వచ్చారు?" అంది నవ్వుతూ సమీర.

అతను కూడా నవ్వుతూ, "మరి అదే కదా నా చదువూ, వృత్తి, జీవితం. ఈ షాపతన్ని అడిగాను. ఇక్కడికి అరమైలు దూరంలో చాల రెష్టారెంట్లు వున్నాయట. మీ ఛాయిస్" అన్నాడు.

ఇద్దరూ అటువేపు నడుస్తుంటే చిరుచలితో బాగుంది.

కోటు జేబుల్లో చేతులు పెట్టుకుని నడుస్తున్నది సమీర.

"సైకాలజీ మీ వృత్తి అన్నారు, మీరు సైక్రియాట్రిస్టా, సైకాలజిస్టా?" అడిగింది సమీర.

"సైకాలజిస్టునే. సైకాలజీలో పీహెచ్డీ పూర్తిచేశాక, కాలిఫోర్నియాలోనే ఒక మెంటల్ హెల్త్ కేర్ గ్రూపులో, కౌన్సెలింగ్ సైకాలజిస్టుగా మూడేళ్ళ పైగా ఉద్యోగం చేశాను. నాకు అలాటి గ్రూపుల్లో పనిచేయటం బోరు కొట్టేసింది. మొదటినించీ నా స్వతంత్ర భావాలు నావి. నా ప్రాక్టీస్ స్వంతంగా పెట్టుకుందామని ఆ ఉద్యోగానికి రాజీనామా చేసేశాను. కావలసిన ఆఫీసు, మిగతావి దాదాపు సిద్ధమవుతున్నాయి. ఈలోగా ఖాళీగా వుండటమెందుకని ఇక్కడికి వచ్చాను" అన్నాడు.

"ఈ విశాల ప్రపంచంలో ఎన్నో ప్రదేశాలుండగా ఇక్కడికే ఎందుకు వచ్చారు?" అడిగింది సమీర.

ఈలోగా ఆ నాలుగు రోడ్ల కూడలి దగ్గరకు వచ్చారు.

"పుస్తకాల షాపతను చెప్పింది నిజమే. చూడండి ఇక్కడ ఎన్ని రెస్టారెంట్లు వున్నాయో. చెప్పండి ఎక్కడికి వెడదాం?" అడిగాడు నిక్.

"ఏదయినా ఫరవాలేదు. వెజిటేరియన్ ఫుడ్ దొరికితే చాలు" అంది సమీర.

"మీరు వెజిటేరియనా? నేను వీగన్ని. అంటే మీకన్నా రెండాకులు ఎక్కువే చదివాను అన్నమాట. ఏ జంతు సంబంధమైన ఆహారాలూ తినను. పాలూ, ఛీస్, ఎగ్స్ అలాటివేవీ తినను" అన్నాడు నిక్.

"ఎందుకని?" అని అడిగింది సమీర నవ్వుతూ.

"ఈ భూమి మీద మనుష్యులకు జీవించటానికి ఎంత హక్కు వుందో, జంతువులకూ అంతే హక్కు వుంది. నోరులేని జంతువులు కదా అని వాటిని హింసించి ప్రాణాలు తీసేయటం ఎందుకు? చంపేసిన ఆ జంతువులను తినటం ఎందుకు? లివ్ అండ్ లెట్ లివ్. అందుకని" అన్నాడు నిక్.

"బాగుంది. అయితే ఆ ఎదురుగావున్న ఇటాలియన్ ప్లేసుకి వెడదామా?" అంది సమీర.

“రండి” అంటూ అక్కడికి దారి తీశాడు నిక్.

చాల చిన్న రెస్టారెంటు. అరడజను టేబుల్స్ వున్నాయేమో. వాటిలో రెండు టేబుళ్ళ దగ్గర మాత్రమే ఒకళ్ళిద్దరు కూర్చుని వున్నారు.

కూర్చున్నాక మెన్యూ చూస్తూ అన్నది. “వెజిటేరియన్ పదార్థాలు చాల వున్నాయి” అని తనకి కావలసినవి చెప్పింది సమీర.

నిక్ కూడా తనకి కావలసినవి చెప్పి, “నో ఎగ్, నో మీట్, నో ఛీస్ ఫర్ మి ప్లీస్” అన్నాడు.

వెయిటర్ వెళ్లిపోయాక అన్నాడు నిక్ “ఇందాక అడిగారు కదా. ఇక్కడికే ఎందుకొచ్చానని”

తల వూపింది సమీర.

ఒక్క క్షణం ఆగి, “గలగలా పారే నదిని ‘ఇటే ఎందుకు వెడుతున్నావు’ అని అడిగితే ఏం చెబుతుందో దాదాపు అదే నా జవాబు” అన్నాడు నవ్వుతూ.

“మీరేమిటి భావ కవిత్వం వ్రాస్తారా?” పెద్దగా నవ్వుతూ అడిగింది సమీర.

“వ్రాయను. కానీ ఈ నదీ ప్రవాహం ఆగాక, తీరిగ్గా వ్రాద్దామనుకుంటుంటాను” అన్నాడు నవ్వుతూ.

“నాకు అర్ధమయే భాషలో చెప్పండి” అంది సమీర.

వైటర్ రెండు గ్లాసులూ, ఒక రెడ్ వైన్ సీసా తెచ్చి అక్కడ పెట్టి వెళ్ళిపోయాడు.

“ఏమీ లేదు. నాకు మొదటినించీ ఇంగ్లీష్ సాహిత్యం, ముఖ్యంగా షేక్స్పియర్ నాటకాలు, కీట్స్, షెల్లీ, బైరన్, మిల్టన్ కవిత్వం, సర్ కానన్ డాయల్ మిష్టరీ మొదలైనవి నాకెంతో ఇష్టం. ఇవన్నీ ఇష్టపడే ఎవరైనా మొట్టమొదటగా వచ్చేది ఇంగ్లాండుకే కదా! అదే బాబ్ జెస్సికాలతో చెబితే ముందుగా వాళ్ళ దగ్గరకే రమ్మన్నారు. నేను ఇక్కడికి వచ్చి ఇప్పటికి ఒక నెల దాటింది. ఇంకో నెల లోపలే వెనక్కి వెళ్ళిపోవాలి” అన్నాడు నిక్.

“లండన్లో షేక్స్పియర్ గ్లోబ్ థియేటర్లో ‘మేక్బత్’ నాటకం నేనూ, జెస్సీ చూశాము. చాల బాగుంది. అదే నేను మొట్టమొదటిసారిగా స్టేజ్ మీద షేక్స్పియర్ నాటకం చూడటం” అన్నది సమీర.

“అవును, అది నాకెంతో ఇష్టమైన నాటకం. ‘Life is a tale told by an idiot, full of sound and fury, signifying nothing’ అనే కొటేషన్ మనల్ని ఆలోచనల్లో పడేస్తుంది. అంతేకాదు చివరలో లేడీ మేక్బత్ చెప్పే డైలాగులు వింటుంటే కళ్ళల్లో నీళ్ళు తిరుగుతాయి” అన్నాడు నిక్.

ఈలోగా వైటర్ సలాడ్, గార్లిక్ బ్రెడ్ తెచ్చి అక్కడ పెట్టి వెళ్ళిపోయాడు.

అవి తింటూనే నిక్ చెప్పటం కొనసాగించాడు. “నేను లండన్లో వున్న ఇరవై రోజుల్లోనూ అదే పని. అక్కడ కీట్స్ కవిగారి మ్యూసియం చూశాను. షెల్లీగారి మ్యూసియం ఇంకొకటి. నాకెంతో ఇష్టమైన ‘పారడైస్ లాస్ట్’ వ్రాశాడే, జాన్

మిల్టన్, ఆయన మెమోరియల్ కూడా లండన్లోనే చూశాను. మహామహులందరినీ మరొక్కసారి గుర్తుకు తెచ్చుకున్న ఇరవై రోజుల పెద్ద పండుగది. అంతేకాదు, సర్ ఆర్థర్ కానన్ డాయల్ సృష్టించిన షెర్లాక్స్ హోమ్స్ ఇల్లు కూడా చూశాను. అదో సరదా కథ. నేను మిమ్మల్ని బోరు కొట్టించటం లేదు కదా!" చెప్పటం ఆపాడు నిక్.

"చెప్పండి. సరదా కథ అన్నారు కదా, నాకూ వినాలని సరదాగా వుంది" అన్నది సమీర నవ్వుతూ.

ఈలోగా వాళ్ళు ఆర్డర్ చేసిన పదార్థాలు రావటంతో, ఇద్దరూ తినటం ప్రారంభించారు.

నిక్ కూడా తన సాహిత్య ప్రయాణం గురించి చెప్పటం కొనసాగించాడు.

"కానన్ డాయల్ గారు తన పుస్తకాల్లో షెర్లాక్ హోమ్స్ ఇల్లు 221B బేకర్ స్ట్రీట్ అని వ్రాశారు కదా. ఆయన వ్రాసిన ఆ రోజుల్లో అసలు బేకర్ స్ట్రీట్లో వంద ఇళ్ళే వున్నాయిట. ఆ ఇంటి నెంబరు 221B ఆయన కల్పించినది. తర్వాత లండన్ ఒక పెద్ద మహానగరం అయిపోయాక ఆ రోడ్డులో ఎన్నో ఇళ్ళు వచ్చేశాయి. 221 నెంబరు ఇంట్లో యాబ్బీ నేషనల్ బిల్డింగ్ సొసైటీ వారు వుండేవారు. అప్పుడు వాళ్ళకి రోజూ షెర్లాక్ హోమ్స్ పేరున వందల కొద్దీ వుత్తరాలు వచ్చేవిట. అప్పుడే షెర్లాక్ హోమ్స్ మెమోరియల్ 221 ఖాళీగా లేకపోవటం వల్ల 239 బేకర్ స్ట్రీట్లో పెట్టారు. కాకపోతే యాబ్బీ నేషనల్ వాళ్ళు పోస్ట్మేనుకి చెప్పారుట, షెర్లాక్ హోమ్స్ 221B అడ్రసుకి వచ్చే ఆ కొన్ని వందల వుత్తరాలని 239 అడ్రసులో ఇవ్వమని. నేను వెళ్ళాను అక్కడికి. ఆయన పుస్తకాలు వ్రాసుకున్న బల్ల, కుర్చీ అన్నీ వున్నాయి. అదో ఆనందకరమైన అనుభవం"

"బాగుంది మీ ఆనందకరమైన అనుభవం. నా మిత్రులు చాలమంది అంటుంటారు నేను చాల ఎక్కువగా మాట్లాడతాననీ, ఇతరులు చేప్పేవి విననని. నాకు నా నోరూ, వినేవారి చెవులే ముఖ్యమని అంటుండేది ఒక స్నేహితురాలు. అది ఇప్పుడు ఎక్కడుందో కూడా తెలీదు. దానితో మాట్లాడి ఎన్నో ఏళ్ళు అయింది. అది చెప్పింది కొంతవరకూ నిజమేమో కానీ, మీరు చెబుతుంటే నిజంగా అంతా విన్నాను. మీ నోటికి నా చెవులు అతికించాను" అంది సమీర.

పెద్దగా నవ్వాడు. "మీకో విషయం తెలుసా. ఇలాటి నా పాషన్ వున్న విషయాల్లో తప్ప మిగతా విషయాల్లో నేను ఎక్కువ మాట్లాడను అంటాడు మా బాబ్" అన్నాడు నిక్.

"అవును. అది తెలుస్తూనే వుంది. నాకు ఇంగ్లీష్, తెలుగు, ఏ భాషా సాహిత్యమైనా సరే, ఎక్కువ ఉత్సాహం లేదు. ఎప్పుడో ఊసుపోకకేదో చదువుతూ వుంటాను తప్ప నేనొక పెద్ద రీడర్ని కాదు" అన్నది సమీర.

తినటం పూర్తయింది కనుక, ఖాళీ పళ్ళాలు అన్నీ ఒకదాంట్లో ఇంకొకటి పెడుతూ అన్నాడు నిక్, "ఒక పని చేద్దాం. నేను నా రూముకి వెళ్ళటానికి బస్సులో ఇరవై నిమిషాలు పడుతుంది. వచ్చే వారం అంతా, శుక్రవారం దాకా బాగా బిజీ. ఆ తర్వాతే మళ్ళీ మిమ్మల్ని కలవటం. మిమ్మల్ని మీ ఎపార్టుమెంటులో దించి నేను వెడతాను" అన్నాడు క్రెడిట్ కార్డు అక్కడ పెడుతూ.

"మీరెందుకూ. నేనిస్తాను" అంది సమీర.

"లేదు. ఈరోజు మీరు నా అతిథి" అన్నాడు నిక్.

ఇద్దరూ కలిసి సమీర ఎపార్టుమెంటు వేపు నడుస్తుండగా అడిగింది సమీర. "మరి ఈవూళ్ళో ఏ కవి, రచయితల మ్యూసియంలయినా చూస్తున్నారా?" అని.

"లేదు. ఈ రాబోయే వారమంతా నాలాటి సామాన్యులకు అంతుబట్టని సత్యాన్వేషణ. ఇందాక చెప్పానే షేక్స్పియర్ కొటేషన్. ఆయన ఎందుకు అలా అన్నాడా అని. వచ్చేవారం శ్ట్రాట్ఫర్డ్ వెళ్ళి షేక్స్పియర్ పుట్టి పెరిగిన ప్రదేశం చూడాలి. అదవగానే అంబరాన అమెరికాకు. నా స్వంత ప్రాక్టీసు ప్రారంభం చేసుకోవటం. మళ్ళీ రొటీన్లో పడటం" అన్నాడు నిక్ నవ్వుతూ.

"అయితే వచ్చే శుక్రవారం కలుద్దాం. ఈలోగా ఇదిగో నా యు.కె. ఫోన్ నెంబర్, అమెరికా నెంబరు" అంది.

"థాంక్స్. ఇవిగో నా రెండు ఫోన్ నెంబర్లు. నేను ప్రతిరోజూ చీకటి పడ్డాకే ఫ్రీ. అప్పుడు వీలుంటే నేను పిలుస్తానులెండి. మాట్లాడుకుందాం"

"సరే. థాంక్స్ ఫర్ ది డిన్నర్. గుడ్ నైట్" అన్నది సమీర.

## 6

మర్నాడు ప్రొద్దున్నే వేణు, రేఖ ఇద్దరూ రేఖ బాంకుకి వెళ్ళారు.

రేఖ తన దగ్గర ఎకౌంట్ నెంబరు లేదనీ, తన పేరూ, డ్రైవర్స్ లైసెన్స్ చూపించి, డబ్బులు తీసుకోవటానికి వచ్చాను అన్నది.

అక్కడ వున్న టెల్లర్, ఆమె డ్రైవర్ లైసెన్సు, ఫొటో, సోషల్ సెక్యూరిటీ నెంబరూ చూసి, ఎకౌంట్ ఆమెదేనని నిర్ధారించుకుని, "ఎంత కావాలి?" అని అడిగాడు.

"బాలన్స్ ఎంత వుంది?" అడిగింది రేఖ.

"ఐదు వేలు" అన్నాడు అతను.

"అదేమిటి ముప్ఫై వేల పైనే వుండాలే?" అన్నది రేఖ.

"అవును. మూడు వారాల క్రితం ముప్ఫై ఆరు వేల బాలన్స్ వుంది. కానీ పోయిన రెండు వారాల్లోనూ నాలుగుసార్లు డబ్బులు తీసుకున్నట్టు వుంది. మా బాంకులో చెకింగ్ ఎకౌంట్లో కనీసం రెండు వేలు వుండాలి. ఇప్పుడు వున్న ఐదు వేలల్లో మీకు ఎంత కావాలి" అని అడిగాడు అతను.

రేఖ ముఖం పాలిపోయింది. "మూడు వేలు తీసుకుంటాను" అన్నది తేరుకుని.

డబ్బు తీసుకుని కారులో వస్తున్నప్పుడు అన్నది రేఖ, "చూశారా అంకుల్. వాసు బాంక్ బాలన్స్ మొత్తం ఖాళీ చేశాడు" అన్నది.

"అవును. నాకు నిన్నటినించీ అనుమానంగానే వుంది. ఇప్పుడు మనం చేయగలిగింది ఏమీ లేదు. ఒక పని చేద్దాం. ఇక్కడే నేను ఎప్పుడూ వెళ్ళే బాంక్ వుంది. అక్కడ నీ పేరుతో ఒక ఎకౌంట్ మొదలు పెడదాం. అక్కడినించీ మీ ఆఫీసుకి వెడదాం. అక్కడ నీ జీతం డైరెక్ట్ డిపాజిట్ నీ కొత్త ఎకౌంటుకి మార్చు. సరేనా" అన్నాడు వేణు.

సరేనన్నట్టుగా తలవూపింది రేఖ.

"మనం ఈ రెండు పనులూ పూర్తిచేసుకుని, ఇంకా ఏదైనా..." అంటుంటే అన్నది రేఖ, "అంకుల్ ఇంకో రెండు గంటల్లో పాపాయికి ఫీడింగ్ చేయాలి. అది ఇక్కడే పుట్టింది కదా, దానికి అన్నీ టైమ్ ప్రకారం జరగాలి. ఏ కొద్ది ఆలస్యమైనా పెద్దగా ఏడుస్తుంది"

"అలా అయితే ఎన్ని పనులు పూర్తయితే అన్ని మాత్రమే చేసుకుని ఇంటికి వెడదాం. మధ్యాహ్నం ఏం చేయాలో ప్లాన్ చేద్దాం. ఏమంటావు?" అడిగాడు వేణు.

"అలాగే" అంది రేఖ.

కొత్త బాంకులో ఎకౌంట్ ఓపెన్ చేయటానికి ఎక్కువ సమయం పట్టలేదు.

అక్కడినించీ రేఖ ఆఫీసుకి వెళ్ళారు ఇద్దరూ.

"నువ్వు వెళ్ళి నీ పనులు పూర్తి చేసుకో. వీణ ఏవో కూరలూ అవీ తీసుకురమ్మంది. నేను ఇక్కడే ఎదురుగా వున్న గ్రోసరీ షాపులో వుంటాను. నీ పని అవగానే ఫోన్ చేయి. వెంటనే వచ్చేస్తాను" అని వెళ్ళిపోయాడు వేణు.

రేఖ ఆఫీసులోకి రాగానే రిసెప్షనిస్టు లీసా, రేఖని కావలించుకుంది.

"బాగున్నావా? నీకు అమ్మాయి పుట్టింది అన్నావు. అభినందనలు. నీలాగా అందంగా వుందా? ఎప్పుడు చూపిస్తావు?" అన్నది గబగబా.

"బాగానే వున్నాను. సుమ అని పేరు పెట్టాం. సుమ అంటే మా భాషలో పువ్వు అని అర్థం"

***(కొనసాగింపు వచ్చే నెలలో)***

Post your comments